క్లుప్తంగా

63 మందికి వైద్య పరీక్షలు



దూసరపాములోని వైద్యశిబిరంలో పరీక్షలు చేస్తున్న సిబ్బంది

రాజవొమ్మంగి: మండలంలోని దూసరపాము గ్రామంలో గురువారం జరిగిన ఫ్యామిలీ డాక్టర్ వైద్యశిబిరంలో 63 మందికి వైద్య సేవలందించినట్టు డాక్టర్ సరోజ్ తెలిపారు. బీపీ సుగర్ సమస్యలు ఉన్న వారికి ప్రత్యేక పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేసినట్టు చెప్పారు. గర్భిణులు, బాలింతలను పరీక్షించి అవసరమైన సూచనలిచ్చినట్టు తెలిపారు. ఎంఎల్‌హెచ్‌పీ లక్ష్మణ్, హెచ్వీ రమాబాయి, ఏఎన్ఎం సుజాత, సీహెచ్ఓ సత్యవతి, 104 డీఈఓ శ్రీనివాస్ పాల్గొన్నారు. మండలంలోని సూరంపాలెం గ్రామంలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు డీఈవో శ్రీనివాస్ తెలిపారు.

వైఎస్సార్‌సీపీ విజయం తథ్యం



సర్పంచ్ హనుమంతరావు

జి.మాడుగుల: వైఎస్సార్ సీపీ పాడేరు నియోజకవర్గం అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు విజయం తథ్యమని మండల పార్టీ నాయకుడు, సొలభం సర్పంచ్ ఐసరం హనుమంతరావు తెలిపారు. మండల కేంద్రంలో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు గడపగడపకూ సంక్షేమ అభివృద్ధి పథకాలు అందించారన్నారు. జగనన్న పాలనలో విద్యార్థుల ఉత్తమ భవిష్యత్ కోసం ఉన్నత చదువులకు విద్యాదీవెన, వసతి దీవెన, విదేశీ విద్య వంటి పథకాలు అమలు చేశారని గుర్తు చేశారు. మహిళల ఆర్థికాభివృద్ధికి పెద్దపీట వేసిన ఏకైక ప్రభుత్వం జగనన్న సర్కారేనని గుర్తించారన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన జగనన్న ప్రభుత్వాన్ని మళ్లీ పట్ట కట్టడానికి అన్ని వర్గాలు ప్రజలు ఓటు వేసి మద్దతు తెలియజేసినట్టు భావిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఎంపీ అభ్యర్థి తనూజారాణితో పాటు అరకు అసెంబ్లీ అభ్యర్థి రేగం మత్స్యలింగం, కూడా అధిక మెజార్టీతో విజయాన్ని సాధిస్తారని స్పష్టం చేశారు.

పశు వ్యాధులపై అప్రమత్తం



పశువులకు వైద్య శిబిరంలోని టీకాలు వేస్తున్న వైద్యాధికారి గణేశ్వరరావు, సిబ్బంది

అనంతగిరి: పశువులకు సోకే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారి గణేశ్వరరావు అన్నారు. మండలంలోని కాశీపట్నం పంచాయతీ సారవానిపాలెం గ్రామంలోని గురువారం పశువైద్య శిబిరం నిర్వహించారు. జబ్బవాపు, చిటుకు వ్యాధికి సంబంధించి 184 పశువులకు, 78 మేకలకు వ్యాధి నిరోధక టీకాలను వేసినట్టుగా గణేశ్వరరావు తెలిపారు. అనంతరం రైతులకు వర్షకాలంలోని పశువులకు సోకే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, వ్యాధులకు గురైతే వెంటనే సిబ్బందికి సమాచారం అందించాలన్నారు. సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద బాధితులకు పరామర్శ



గాయపడిన బాధితులను కేజీహెచ్‌లో పరామర్శిస్తున్న సర్పంచ్ అన్నపూర్ణ తదితరులు

అనంతగిరి: మండలంలోని మారుమూల పెదకోట పంచాయతీ కేంద్రానికి ఈ నెల 13న ఓటు వేసేందుకు వెళ్తుండగా కుడియా గ్రామ సమీపంలోని వాహనం బోల్తా పడిన ఘటనలో బందకొండ, పాటిపల్లి, వేలమామడి, టాంకోట గ్రామాలకు చెందిన 27 మంది గిరిజనులు గాయపడ్డారు. ఐదుగురు పరిస్థితి విషయంగా ఉండడంతో కేజీహెచ్‌సీలో వైద్యసేవలను పొందుతున్నారు. గురువారం పెదకోట సర్పంచ్ సిరగం అన్నపూర్ణ కేజీహెచ్‌కి వెళ్లి, గాయపడిన వారిని పరామర్శించారు. బాధితులను ఆదుకోవాలని, నిరుపేదలు కావడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని గిరిజనులకు న్యాయం చేయాలని, ఎలక్షన్ కమిషన్ దృష్టికి తీసుకెళ్తామన్నారు.

ప్రగతి పరుగులు



చౌడుపల్లిలో నిర్మించిన ఆర్‌బీకే కేంద్రం



నాడు-నేడు ద్వారా రూపురేఖలు మార్చుకున్న చౌడుపల్లి ఎంపీయూపీ పాఠశాల



గుర్రలగొందిలో నిర్మించిన డ్రైనేజీ

- చౌడుపల్లిలో కోట్లాది రూపాయలతో గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకేలు, వెల్‌నెస్ సెంటర్లు
- శివారు గ్రామాలకు రహదారులు
- ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ

చింతపల్లిరూరల్: మండలంలోని అన్ని పంచాయతీల్లో అన్ని గ్రామాలు కనీస సదుపాయాలు కరువయ్యాయి. చౌడుపల్లి పేరుకు పంచాయతీ కేంద్రమైనా గత పాలకుల నిర్లక్ష్యంగా కారణంగా అభివృద్ధి అంతలా నోచుకోలేదు. చంద్రబాబు పాలనలో పంచాయతీ కేంద్రంతో పాటు పలు గ్రామాలకు కనీస రహదారులు ఉండేవి కావు... రవాణా సౌకర్యం ఊసే లేదు.. దీంతో గిరిజనులు ఎక్కడికి వెళ్లాలన్నా కాలినడకన సాగించే వారు. అత్యవసర సమయాల్లో సేవలందక నానా అవస్థలు పడేవారు..తాగునీటి సౌకర్యాలు లేక ఊటగెడ్డలను ఆశ్రయించి, కలుషిత నీటి వినియోగంతో రోగాల బారిన పడేవారు..అదంతా గతం... వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని గ్రామాల్లో అభివృద్ధి జరిగింది. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులను మంజూరు చేసింది. చౌడుపల్లి పంచాయతీ పరిధిలో 25 గ్రామాలున్నాయి.

జనాభా సుమారు 4800 మంది ఉన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గిరిజన ప్రాంతాభివృద్ధికి విశేష కృషి చేశారు. గిరిజనుల సంక్షేమానికి పెద్దపీట వేయడంతో పాటు సంక్షేమం, అభివృద్ధికి అధికంగా నిధులు కేటాయించడంతో పంచాయతీ కేంద్రంతో పాటు, దాని పరిధిలో ఉన్న గ్రామాల రూపురేఖలే మారిపోయాయి. ఈ పంచాయతీలో సుమారు 25 గ్రామాలుండగా దాదాపు ప్రతి గ్రామానికి సీసీ రోడ్డు ఉంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలకు ప్రభుత్వ సేవలు నేరుగా అందించేందుకు గ్రామ సచివాలయాలు ,ఆర్‌బీకే కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లు అందుబాటులోకి తీసుకొచ్చింది. దీంతో ప్రతి పంచాయతీల్లో ఈ భవనాలు నిర్మాణాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అదే విధంగా గ్రామాల్లో ప్రజలకు సంక్షేమ పథకాలు,అవసరాలకు చేరువ చేసింది. నాడు-నేడు ద్వారా పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కార్యచరణ దాల్చి, కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేసి, వాటి రూపురేఖలను మార్చేసింది.



సచివాలయానికి వెళ్లే సీసీ రోడ్డు



చౌడుపల్లిలో గ్రామ సచివాలయ భవనం

పంచాయతీలో అభివృద్ధి పనులు

చౌడుపల్లిలో రెండు సచివాలయ భవనాలు, రెండు ఆర్‌బీకే కేంద్రాలు నిర్మిచేందుకు ప్రభుత్వం కార్యచరణ చేసింది. ఒక్కో సచివాలయ భవనానికి రూ.43.6 లక్షలు,ఆర్‌బీకే కేంద్రానికి రూ.23.94 లక్షలు , వెల్‌నెస్ సెంటర్ నిర్మాణానికి రూ.20.8 లక్షలు గానుప్రభుత్వం కేటాయించింది. దీంతో ఆ పంచాయతీకి ప్రభుత్వ సుమారు రూ.176.68 లక్షలు వెచ్చించింది.

- చౌడుపల్లి పంచాయితీలో ఒక్కో సచివాలయానికి రూ.40 లక్షలు చొప్పున గడప గడప కార్యక్రమం ద్వారా రెండు గ్రామ సచివాలయాలకు రూ.80 లక్షలను ప్రభుత్వం మంజూరు చేసింది.
- చౌడుపల్లి పంచాయతీ పరిధిలో బొర్తి, రత్నగిరికోలని, చౌడుపల్లి, గుర్రలగొంది, ఈదులబయలు, గాడిదల మెట్ట,గొయ్యల మెట్ట తదితర గ్రామాలకు పంచాయతీ రాజ్,గిరిజన సంక్షేమ శాఖ ద్వారా సీసీ రోడ్లు ప్రభుత్వం వేసింది.
- ఇవి కాక మారుమూల గ్రామాలకు మిషన్ కనెక్ట్ పాడేరు పథకంలో పలు రహదారి లేని గ్రామాలకు ప్రస్తుతం గ్రావెల్ రహదారుల నిర్మాణాలకు అవసరమైన చర్యలు చేపట్టారు.
- చౌడుపల్లిలో ఎంపీయూపీ పాఠశాలను ప్రభుత్వం నాడు-నేడు ద్వారా పాఠశాలలో రంగులు, హంగులతో రూపురేఖలు మార్చేసింది. పిల్లలు చదుకుకోవాలనే ఆశను వారికి కలిగేలా రూపు దిద్దింది.

గ్రామాల్లో పురోగతి



గత టీడీపీ ప్రభుత్వం హయాంలో పాలకులు మా పంచాయతీని కనీసం పట్టించుకోలేదు. ఏ గ్రామంలోనూ మౌలిక సదుపాయాలు ఉండేవి కావు. జగనన్న ప్రభుత్వంలో మా పంచాయతీ అభివృద్ధికి ఆస్కారం ఏర్పడింది. అన్ని రంగాల్లోనూ మా పంచాయతీ అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తుంది. మున్నపెన్నడూ లేనంతగా పంచాయతీలో అన్ని ప్రాంతాల్లో పురోగతి కనిపిస్తోంది.

– పరమేష్,
ఈదులబయలు, గ్రామం, చౌడుపల్లి పంచాయతీ

అనూహ్యంగా అభివృద్ధి



మా పంచాయతీలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎనలేని అభివృద్ధి జరిగింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పంచాయతీలోని ఏ గ్రామానికి సరైన రోడ్డు లేదు. తాగునీటి సదుపాయం ఉండేది కాదు. జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మా పంచాయతీలో అన్ని గ్రామాలకు మౌలిక సదుపాయాలు కలిగాయి. పంచాయతీ అనూహ్యంగా అభివృద్ధి జరిగింది.

– గెమ్మెలి లలిత, సర్పంచ్,
చౌడుపల్లి పంచాయతీ, చింతపల్లి మండలం

వేసవి శిక్షణ తరగతులు ప్రారంభం

హుకుంపేట: వేసవి శిక్షణ తరగతులను విద్యార్థులు వినియోగించుకోవాలని, జ్ఞానం పెంపొందించుకోవాలని, గ్రంథాలయాధికారి మానస తెలిపారు. మండల కేంద్రంలోని గ్రంథాలయంలోని ఈనెల 15 నుంచి వచ్చేనెల 7వ తేది వరకు వేసవి శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. డ్రాయింగ్, ఆటలు, పాటలు, వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

19న లక్ష తులసీ పూజ



వేంకటేశ్వర దేవాలయం

రోలుగుంట: స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద ఈ నెల 19న లక్ష తులసీ పూజా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఆలయ వంశపారంపర్య ధర్మకర్త దివంగత ముత్యాల రామస్వామి కుమారులు తెలిపారు. ఆలయం వద్ద ఆదివారం ఉదయం 6 గంటలకు స్వామివారి పురాతన శిలావిగ్రహానికి పంచామృతాభిషేకం, నీరాజనం, 8 గంటల నుంచి లక్ష తులసీ పూజ భక్తుల బృందాలతో నిర్వహిస్తామన్నారు. వంద మంది భక్తులతో సహస్రనామార్చన చేస్తామన్నారు. 20 మంది ఒక బృందంగా ఈ పూజలు నిర్వహిస్తామని అర్చకుడు రేజేటి శ్రీనివాసాచార్యులు తెలిపారు.

వాసవీమాత జయంతి రేపు



మాడుగుల రూరల్: వాసవీమాత జయంతిని పురస్కరించుకుని శనివారం కె.జె.పురం జంక్షన్‌లో కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో వాసవీమాతకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని వాసవీక్లబ్ అధ్యక్షుడు శ్రీనాథు శేఖర్ గురువారం తెలిపారు. మాజీ సర్పంచ్ పాలకుర్తి ఆదినారాయణ(మైనర్) కుటుంబ సభ్యులు సహకారంతో మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేస్తున్నామన్నారు. శ్రీనాథు మల్లన్న కుటుంబ సభ్యులు మజ్జిగ వితరణ చేస్తారన్నారు. వాసవీమాత కుటుంబ సభ్యులు హాజరు కావాలని కోరారు.

క్షయపై అవగాహన అవసరం



మండల కేంద్రంలోని జెడ్పీటీసీ గంగరాజుకు వ్యాక్సిన్ వేస్తున్న వైద్యాధికారి జ్ఞానేశ్వరి



పెదవలసలో వ్యాక్సినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న సిబ్బంది

అనంతగిరి: టీబీ రాకుండా ముందస్తు బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమం జరుగుతుందని, అనంతగిరి పీహెచ్‌సీ వైద్యాధికారి జ్ఞానేశ్వరీ అన్నారు. మండల కేంద్రంలోని గురువారం నుంచి వ్యాక్సినేషన్ కార్యక్రమం ప్రారంభించారు. ముందగా జడ్పీటీసీ గంగరాజు, స్థానికులకు వ్యాక్సిన్ వేశారు. టీబీని నివారించేలా వైద్య ఆరోగ్యశాఖ ముందస్తు చర్యలు చేపట్టిందని, వ్యాక్సినేషన్ పీహెచ్‌పీ పరిధిలోని పంచాయతీలోని అందుబాటులోని ఉంటాయన్నారు. 18 నిండిన వాళ్లు, అలాగే టీబీ, బీపీ, షుగర్, పొగత్రాగువారు వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు. ఎంపీహెచ్ఈవో నర్సింగరావు, పీహెచ్ఎస్. బాలమ్మ, ఏఎన్ఎం గౌరీ, టీబీ సూపర్‌వైజర్ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: రాష్ట్రంలోనూ దేశంలోనూ క్షయ వ్యాధిని సమూలంగా నిర్మూలించే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవసరమైన చర్యలు చేపడుతున్నాయని పెదవలస వైద్యాధికారి కోమలి అన్నారు. అడల్ట్ బీసీసీ వ్యాక్సినేషన్ కార్యక్రమంలో భాగంగా గురువారం పెదవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 18సంవత్సరాలు నిండిన వయోజను లందరికీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ప్రతి సచివాలయం పరిధిలో ప్రతి గురువారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. గురువారం 110 మందికి ఈ వ్యాక్సినేషన్ వేశారు. వైద్యాధికారి పృధ్వీషా, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసరావు, ఎంపీహెచ్ఈఓ బాలరాజు, రోజ్‌గోల్డ్ సిబ్బంది వరలక్ష్మి, అనీషా, మాధవి పాల్గొన్నారు.

డెంగ్యూ జ్వరాలపై అప్రమత్తత



రంపచోడవరం ఏరియా ఆస్పత్రి నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది



రాజవొమ్మంగిలో ర్యాలీలో పాలొన్న డాక్టర్ సుష్మ, సిబ్బంది

రంపచోడవరం: జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా డెంగ్యూ వ్యాధిని నిర్మూలిద్దాం అనే నినాదంతో ఏరియా ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆస్పత్రి నుంచి బోర్నగూడెం వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ కె.లక్ష్మి మాట్లాడుతూ మంచి ఆరోగ్యంతో రోగాల బారిన పడకుండా ఉండవచ్చన్నారు. డెంగ్యూ వస్తే తక్షణమే ట్రిటిమెంట్ వివరించారు. నాలుగు రోజులు మించి జ్వరం వస్తే ఆస్పత్రిని సంప్రదించాలన్నారు.వైద్యులు డిసోజా, హారిక, ఇందిర, కౌన్సిలర్ ఎస్.వాసు ల్యాబ్ టెక్నిషియన్ నాగభూషణం, వీరకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో డెంగ్యూ, మలేరియా తదితర వ్యాధులపై గురువారం స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుష్మ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డెంగ్యూ, మలేరియా తదితర వ్యాధుల బారిన పడకుండా ప్రభుత్వం సరఫరా చేసిన దోమతెరలను ప్రతి ఒక్కరు విధిగా ఉపయోగించాలన్నారు. అనారోగ్యమైతే తక్షణమే సమీపంలో పీహెచ్‌సీ ద్వారా వైద్య సేవలు పొందాలని సూచించారు. డెంగ్యూ తదితర అన్ని రకాల రోగాలకు పీహెచ్‌సీలో సంమృద్ధిగా మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. జ్వరం, ఒంటి నొప్పులు ఉంటే అశ్రద్ధ చేయకుండా ఆసుపత్రికి వచ్చి చికిత్స పొందాలని కోరారు. మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ ప్రసాద్, ఎంటీఎస్. సోమరాజు, హెచ్ఎస్. సుధాకర్, హెచ్వీ రామాబాయి, ఏఎన్ఎం, ఆశలు పాల్గొన్నారు.

19న మోదకొండమ్మ జాతర

మాడుగుల రూరల్: ఎం. కోడూరులో ఈ నెల 19న మోదకొండమ్మ జాతర ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతర రోజున అమ్మవారిని పట్టువస్త్రాలు, వెండి ఆభరణాలతో అలంకరించి నెల రోజుల పాటు జాతర నిర్వహిస్తామన్నారు. ఈ నెల 18న 101 కాగడాలు, డప్పులు, వాయిద్యాలతో మందుగుండు సామగ్రి కాల్పులు, కామిని వేషాలు, ఏనుగుల ఊరేగింపుతో తోల్లేల జాతర నిర్వహిస్తామన్నారు. అదే రోజు భామా కళాపం పౌరాణిక నాటకం ప్రదర్శన ఉంటుందన్నారు. జాతర రోజు సాయంత్రం అమ్మవారి ప్రభ ఊరేగింపు, సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

వైభవంగా కామేశ్వరమ్మతల్లి పండగ



వర్షంలోనూ ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు

మాకవరపాలెం: రాచపల్లిలో కామేశ్వరమ్మతల్లి పండగను గురువారం వైభవంగా నిర్వహించారు. ఏటా మాదిరిగానే నిర్వహించిన ఈ పండగ సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. స్థానికులే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి సైతం పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ఉదయం నుంచి వర్షం కురుస్తున్నా దర్శనానికి క్యూ కట్టారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రసాదాలు పంపిణీ చేశారు.

రేపటి నుంచి వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాలు

మాడుగుల రూరల్: స్థానిక వేంకటేశ్వరస్వామి తిరు కల్యాణోత్సవాలు ఈ నెల 18 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఉత్సవాలు దేవదాయ శాఖ ఆధ్వర్యంలో జరుగుతాయని కమిటీ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆలయ ప్రధాన అర్చకులు నున్న శ్రీనివాస చార్యులు, ఆరవల్లి రఘునాథచార్యులు ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో భాగంగా రోజూ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు చెప్పారు. స్థానికులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు తరలిరావాలని కోరారు.

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి



కిన్నెర్ల గ్రామంలో స్థానికులతో మాట్లాడుతున్న గుర్తేడు ఎస్ఐ సాయికుమార్

వై.రామవరం: మన ఊరు మన పోలీసు కార్యక్రమంలో భాగంగా గుర్తేడు పోలీసు స్టేషన్ పరిధిలోని కిన్నెర్ల గ్రామంలో ఎస్ఐ పి.సాయికుమార్ గురువారం గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సాయికుమార్ మాట్లాడుతూ మారేడుమిల్లి సీఐ ఆర్.భీమరాజు ఆదేశాల మేరకు ఈ సమావేశం నిర్వహించినట్టు చెప్పారు. ప్రజలు పోలీసులతో సత్సంబంధాలు కలిగి ఉండాలన్నారు. ఏ సమస్య ఉన్నా భయపడకుండా నేరుగా పోలీసు స్టేషన్‌కు వచ్చి పరిష్కరించుకోవచ్చునన్నారు. యువత పెడతోవ పట్టకుండా కాపాడుకునే బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. జూదం, కోడి పందాలు వంటి అసాంఘిక కార్యకలాపాల జోలికి వెళ్లవద్దన్నారు. సారా తయారీ, విక్రయాలు, గంజాయి సాగు, అక్రమ రవాణా వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. పోలీసు శాఖ కూడా గిరిజన ప్రాంత అభివృద్ధిలో పాలుపంచుకుంటుందన్నారు. యువతకు ఉపాధి, ఉద్యోగ తదితర రంగాల్లో ప్రోత్సహించేందుకు పోలీసు శాఖ అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. సిబ్బంది, పాల్గొన్నారు.

సాదాసీదాగా సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటలక్ష్మి

రాజవొమ్మంగి: మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ గోము వెంకటలక్ష్మి అధ్యక్షతన గురువారం సాదా సీదాగా జరిగింది. కాగా పలు సమస్యలను సభ్యులు సభ దృష్టికి తెచ్చారు. మండలంలోని పలుచోట్ల హైవే నిర్మాణం వల్ల పెద్ద పెద్ద వృక్షాలను కూల్చేయడంతో నీరు కరువౌతుందని, ఆయా చోట్ల మొక్కలు పెంచాలని కోరారు. అదే విధంగా మండల కేంద్రం రాజవొమ్మంగిలో బస్‌షెల్టర్ లేదని, టాయ్‌లెట్స్ లేక పోవడంతో మహిళలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వట్టిగెడ్డ రిజర్వాయర్‌కు మరమ్మతు చేసి సాగునీరందేలా చూడాలని కోరారు. ఆయా సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొని వెళ్తాని ఎంపీడీవో యాదగిరీశ్వరరావు సభ్యులకు హామీ ఇచ్చారు. వైస్ ఎంపీపీలు చంద్రరాణి, రాజేశ్వరి పాల్గొన్నారు.

అమ్మవారి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ విడుదల చేస్తున్న ఎంపీ మాధవి తదితరులు

కొయ్యూరు: నడంపాలెం-శరభన్నపాలెం మధ్య వెలిసిన యర్రగొండమ్మ ఉత్సవాలను ఈనెల 24 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కమిటీ ఆహ్వానం మేరకు అరకు ఎంపీ గొడ్డేటి మాధవి గురువారం ఆలయంలో ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ప్రాంతవాసుల ఆరాధ్య దైవంగా యర్రగొండమ్మ తల్లికి ఎంతో పేరుందన్నారు. అమ్మవారి ఉత్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు లోకుల సోమాగాంధీ, సర్పంచ్ కిముడు సత్యనారాయణ, ఇబ్రహీం, నేనుసైతం చారిటబుల్ సంస్థ వ్యవస్థాపకులు కె.శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కొమరవోలు తల్లి పండగ



పూజలు చేస్తున్న భక్తులు

రోలుగుంట: కొమరవోలులో గ్రామదేవత పండగను గ్రామస్తులు గురువారం ఘనంగా నిర్వహించారు. మూడేళ్లకొకసారి నిర్వహించే పండగకు ఇతర జిల్లాలు, రాష్ట్రాల్లో ఉద్యోగ, వ్యాపార రంగాల్లో స్థిరపడిన గ్రామస్తులు స్వగ్రామానికి తరలి వచ్చారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అమ్మవారి ఆలయం వద్ద గ్రామ వీధుల్లో విద్యుద్దీపాలంకరణతో ముస్తాబు చేశారు. వేకువ జాము నుంచి సాయంత్రం వరకు భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సర్పంచ్ గొర్లె రమణమ్మ, ఉప సర్పంచ్ బోశం వెంకటలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు గొర్లె వెంకటరామన్, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఆలయం వద్ద బాణసంచా కాల్చారు. అదేరోజు రాత్రి గ్రామ వీధుల్లో ఏర్పాటు చేసిన స్టేజ్‌లపై ఆర్కెస్ట్రా, సినీ డూప్ ఆర్టిస్టుల డ్యాన్స్, బుర్రకథ తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయం వద్ద ఉత్సవ కమిటీ చైర్మన్ గొర్లె చెల్లంనాయుడు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు.